# అందరూ మనుషులే

క్రోవి రామమోహన శాస్త్రి

ఈ మధ్య మా ఆవిడ ధోరణి నాకు చాలా ఆశ్చర్యంగా వుంది డ్యూటీ ముగిశాక ఇంటికి వెళ్ళాలనుకుంటేనే చికాకు కలిగేటంత విచిత్రంగా కూడా వుంది. అసలే పని చేసేది ప్రైవేటు కంపెనీ. తుమ్మితే ఊడిపోయే ముక్కులాంటి వుద్యోగం. ఇచ్చేది ఎక్కువ గాకపోయినా, ఎనిమిది గంటలూ వంచిన నడుం ఎత్తనీకుండా చాకిరి చేయించుకుంటారు. పైగా ఏ చిన్న లోపం కనిపించినా చివాట్లూ, చెప్పుదెబ్బలూ. జీవన పోరాటం మరి! అన్నీ భరిస్తూనే పాతికేళ్ళయి పని చేస్తూ యాభై ఏళ్ళు ఒంటి మీదికి తెచ్చుకున్నాను.

చెప్పొచ్చేదేవిఁటంటే చచ్చి చెడి శాయం గల విన్నపాలని, ఒంట్లో ఓపికంతా డ్యూటీలో ఖర్చు చేసుకుని కొంపలో కాలు పెడితే, యిల్లాలి గోలతో గుండె దడ పుట్టుకొస్తోంది. ఆ మాటకొస్తే అంత గోల పెట్టి నన్ను హడల గొట్టేటంత దారుణ పరిస్థితులంటూ ఏం లేవు. అయినా ఆవిడ గారి హడావిడికి అంతూ పంతూ లేకుండా పోతోంది.

రోజూ లాగే ఆ రోజు కూడా ఠంచనుగా అయిదింటికల్లా ఇంటికి చేరాను.

"అమ్మయ్య! వచ్చారా!" అన్నది కాంతం.

"అదేవిఁటి, అలా అడుగుతున్నావ్? దేన్నన్నా లేవుకు పోయానని కబురొచ్చిందా?" అన్నాను కుర్చీలో కూలబడుతూ.

"వస్తే మటుకు నేను నమ్ముతానా!"

"నా మీద అంత నమ్మకం వుందన్న మాట!"

"మీ మీద నమ్మకం సంగతేమో గాని, మీతో లేచొచ్చేందుకు, నా కన్న తలకి మాసిన ఆడది ఈ భూప్రపంచంలో వుండదని నా పూర్తి నమ్మకం!"

"నేను నిక్షేపంలా వుంటే నీకు తల మాయడమేవిఁటే?"

కాంతం నన్ను అమాంతం నమిలి మింగేలా చూస్తూ, "ఏవిఁటా వెధవ కూతలూ? మరి మతి పోతున్నట్లుంది మీకు!" అంటూ మంగళ సూత్రాలు కళ్ళకి అద్దుకుని విస–విస లోపలికి వెళ్ళింది

అలాంటి మాటొకటి పడేస్తే గాని ఈ ఈవినింగ్ షోలో మా కాంతం టెంపరరీగా ఎగ్జిట్ అవదు. అది నాకు కాఫీ కలిపి తీసుకురావడానికి పట్టే పది నిముషాల కాలంలో కాస్త విశ్రాంతి తీసుకోవచ్చన్న ఆశ.

అయినా దీనికి ఇదేం జబ్బో అర్థం కావడం లేదు. మరి ఓ మూడు నాలుగు నెలలుగా ప్రతి చిన్న విషయానికి వాదనకి దిగిపోతోంది. వాదనతో సరిపెడితే బాగానే వుండేది. కాని బాహాబాహీ యుద్ధానికి సిద్ధ పడుతోంది. పోనీ మనసులో ఏముందో చెబుతుందా అంటే అది లేదు. ఆఖరికి ఈ సమర శంఖారావాలకి తట్టుకోలేక గట్టిగా నోరు చేసుకుంటే, మా కాంతం పాత్ర ట్రాజెడీ నాటకం క్లైమాక్సులో లాగా ఏడుపులూ, మొత్తుకోళ్ళూ, ముక్కు చీదుకోవడాల్తో నిష్క్రమిస్తుంది ప్రతిరోజూ ఈ సీను, కొద్ది పాటి తేడాతో జరుగుతూనే వస్తోంది దీనికి ముగింపు ఎక్కడో బోధపడక సతమతమై చస్తున్నాను.

కాంతం గంగాళం లాంటి గ్లాసుతో ఉష్ణద్రవం ఏదో తీసుకొచ్చింది.

"అంత చిన్న గ్లాసుతో తెస్తున్నావ్? కాఫీయేనా?" అనడిగాను

"చాల్లెండి వేళాకోళం! హార్లిక్స్ కలిపాను'తాగండి!" అంటూ అందించింది, కాంతం. ఆవిడ గొంతులో ఇందాకటి తీవ్రత వినిపించలేదు. తక్షణం, ఆ గ్లాసు నిజంగానే ఉగ్గు గిన్నెలా తోచింది నాకు. అందుకున్నాను. ఆత్రంగా తాగుతున్నాను.

"పాపిష్టి నోరు ..." అని ఆగింది కాంతం

ఉలిక్కిపడ్డాను.

"నాదేనా?" అన్నాను.

"ఛీ ఛీ! మిమ్మల్ని అంటే పురుగులు పడి చస్తానండి నేను! నా నోటిని గురించి అనుకుంటున్నాను. ఏవిఁటో ఈ మధ్య మరి పిచ్చి పట్టినట్లు మంచి చెడ్డా లేకుండా మిమ్మల్ని విసిగించేస్తున్నాను." అన్నది కాంతం చాలా నెమ్మదిగా

మలయానిల తరంగం ఒకటి ఎక్కణ్ణుంచో హఠాత్తుగా వచ్చి నా శరీరాన్నీ, మనస్సునీ స్పర్శించినట్లనిపించింది.

ఎదురుగా పైట కొంగు అంచుని వేళ్ళకి ముడేస్తూ, విప్పుతూ ఎప్పుడూ ఎటో చూస్తూ నిలబడ్డ కాంతంలో ఈ మధ్య నేను మర్చిపోయిన సౌందర్య రేఖలు మళ్ళీ కనిపించాయి. సన్నగా నవ్వేను.

"ఎందుకు నవ్వుతున్నారు?" అడిగింది కాంతం.

"ఇలా వచ్చి కూచో, చెబుతాను!" అన్నాను, ఓ ప్రక్కన అందుబాటులో వున్న స్టూలుని ఎదురుగా లాగుతూ.

కాంతం కూచుంది, ఓ సారి తలెత్తి చూసి, మళ్ళీ దించుకుని.

"చెప్పండి! స్టౌ అలాగే మండుతోంది. వేణ్ణీళ్ళు పడెయ్యాలి మీకు!" అన్నది.

"వేణ్ణీళ్ళ దేముందోయ్! నువ్వు హార్లిక్స్ గ్లాసుతో వచ్చిన దగ్గిర్నుంచి నడిచిన సీన్లో, నీ ముఖంలో, మాటల్లో తొంగి చూసిన భావాలు చూసి, చాలా కాలం తరవాత పులకరించాననుకో!ఇలా వరసగా ఓ నాలుగు రోజులు కనిపించావంటే ఆగిపోయిన నాటకం పూర్తి చేసేస్తాను కాంతం! రోజూ ఇలాగే వుండరాదూ? అన్నాను, ఆవిడ చేతి గాజులు సవరిస్తూ.

"ఎలా వుండాలంటారు? ఇక్కడే, ఈ స్టూలు మీద, మీ ఎదురుగానా? ముందు చెయ్యి వదలండి! వీధి తలుపు తీసే వుంది ఎవరేనా వస్తారు. మన వేషాలు చూస్తే నవ్వుతారు!" అన్నది కాంతం. అన్నదే గాని చెయ్యి మాత్రం విడిపించుకోలేదు. ఆమె ముఖం అత్యంత ప్రసన్నంగా వుంది. చేతుల మధ్య వున్న ఆమె చెయ్యి కొద్దిగా కంపించడం కూడా నేను గమనించాను.

"మన వేషాల కేం లోటు కాంతం? ఇప్పటి దాకా బాగానే పోషించుకొచ్చేం, పాతికేళ్ళుగా. ఇప్పుడూ, ఇహ ముందు కూడా మనకి యిష్టమైన ఏ వేషం వెయ్యడానికైనా హక్కుంది. ఇందులో ఇతరుల ప్రమేయం లేదు. సరే. ఆ సంగతి అలా వుంచు. ప్రస్తుతం సూటిగా అడుగుతున్నాను, చెప్పు! ఇన్ని నెలలుగా నాకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నావు! కారణం?" అనడిగేను, గొంతులో కొంచెం గాంభీర్యాన్ని రంగరించి.

"చెప్పానుగా చాలా సార్లు! మీరు వినిపించుకోనిదే నేనేం చేసేది చెప్పండి?" అన్నది కాంతం, నిష్ఠూరంగా

"చూడు కాంతం! ఎదటి మనిషి వినేలా చెప్పే తీరు వేరు! కాని నువ్వా దారొదిలేసి, ఇంట్లో తలెత్తిన ప్రతి, చిన్న సమస్యకి నేనే బాధ్యుడి నన్నట్లుగా ప్రవర్తించావు! నీకు, పరిష్కారం కన్న పరనిందే ప్రధానంగా తోచినట్లుంది. ఆత్మాభిమానం నీకే కాదు, ఎదటి వాడికీ వుంటుందిగా! నేను కట్టుకున్న వాడిననే భావంతో కాక, నీ సాటి మనిషినని గ్రహించి ప్రవర్తిస్తే ఈ గొడవంతా ఉండేదేకాదు!" అన్నాను.

కాంతం రెండు మూడు క్షణాలు నా వైపు కళ్ళార్పకుండా చూసింది. చిరునవ్వు నవ్వింది

"నిజమేనేమో బాబూ! మీ లాజిక్ అర్థం చేసుకోవడం నా వల్ల కాలేదు! ఉండండి! స్టౌ మీద వేణ్ణీళ్ళు పడేసి వస్తాను! కాగే దాకా కదలకుండా

కూర్చుని మాట్లాడుకోవచ్చు!" అంటూ కాంతం చెయ్యి విడిపించుకుని, నెమ్మదిగా వంట గదిలోకి వెళ్ళింది.

కాంతం నా కంటె అయిదేళ్ళు చిన్నది. అప్పుడే ఆమెకి నలభై అయిదేళ్ళు మీద పడ్డాయి. కాని, ఆమె నాకే కాదు, ఆ వయసులో వున్న వాళ్ళెవరికీ అలా కనిపించదు. కనీసం ఓ పదేళ్ళు చిన్నదానిలా కనిపిస్తూ వుంటుంది. నేటికీ ఆమె ముఖంలో, శరీరంలో ఆనాటి కాంతీ, లావణ్యం అలాగే నిల్చిపోయేయి. కాకపోతే అలనాటి చలాకీతనం, చిలిపితనం స్థానంలో కించిత్తు గాంభీర్యం, మరికాస్త చాదస్తం చోటు చేసుకున్నాయి. అప్పుడప్పుడు, బూడిద రంగు తిరిగిన నా క్రాపుని అద్దంలో చూసుకుని, ముసలివాడినై పోతున్నానని బెంగపడిపోతూ వుంటాను.

ఆ మాట కాంతంతో అంటే ఆమె ముగ్ధమనోహరంగా నవ్వి, "ఆ మాట మీతో ఎవరేనా అంటే, నిజానిజాలు నన్నడగమనండి? ఫైనల్ జడ్జిమెంటు నాదేగా!" అనేది.

ఆమె నవ్వు, ఆ విశాలమైన కళ్ళల్లోని మెరుపూ చూసి, నా వయస్సు ఇరవై ఏళ్ళు తగ్గిపోయినట్లనిపించేది నాకు.

నిజమే మరి! మనసుకి వయసు లేదు.

మళ్ళీ కాంతం లోపల్నుంచి వచ్చింది. స్టూలు మీద కూచుంటూ, "చెప్పండి!" అన్నది.

"ఏం చెప్పమంటావ్? కొన్ని నెలలుగా ఖాళీగా వుండిపోయిన పెద్ద మంచం గురించి చెప్పనా? ఆ మంచం మీద ఇప్పుడే పరిచినట్లున్న నలగని తెల్ల దుప్పటి గురించా? దేన్ని గురించి చెప్పేది?" అనడిగాను.

"చాల్లెండి, మరి కుర్రాడై పోతున్నారు రాను రానూ!" అని మధురంగా మందలించబోయింది కాంతం, చిరునవ్వుతో విచ్చుకున్న పెదవులతో.

"మళ్ళా అదేం మాట? , ఇప్పుడేగా ఫైనల్ జడ్జిమెంటిచ్చేశావ్?" అన్నాను.

"అలా అని మరి పచ్చిగా మాట్లాడుకుంటామా?" అన్నది కాంతం, కళ్ళు తిప్పుతూ.

"ఈ వయసులో పచ్చిగా మాట్లాడుకుంటేగాని గుండెల్లో వెచ్చదనం రాజుకోదు కాంతం. ఇది నా థియరీ! రాజీ కొచ్చిన రమణీమణివి. తొందరేముందిలే! రాత్రంతా ముందుంది, బెంగలేదు. ఇక నీ మనోవేదనేమిటో చెప్పెసెయ్." అన్నాను.

కాంతం కొద్ది సేపు మౌనం వహించింది. ఆమె మాటలు వెదుక్కుంటోందని అర్థమైంది. కొంత టైమివ్వడం అవసరం అనిపించింది. ఈలోగా నేనో సిగరెట్టు ముట్టించాను. గట్టిగా రెండు దమ్ములాగి గాలిలోకి వదిలాను. పైపైకి పోతున్న నీలిరంగు పొగల్లోకి చూస్తూ వుండిపోయాను.

కాంతం గొంతు సవరించుకుంది.

"మన కృష్ణబాబు వ్యవహారం!" అన్నది.

కాంతం వైపు దృష్టి మళ్ళించాను.

కృష్ణ మా సుపుత్రుడు. జ్యేష్ఠుడు. మా పెళ్ళయిన ఏడాది కల్లా మా యింట ఊపిరి పిల్చుకున్నాడు. ఇరవై మూడు నిండి ఇరవై నాలుగు మొన్ననే వచ్చింది. బి. కామ్ పాసై ఆర్నెల్ల కిందటే ఊళ్ళోనే వెలసిల్లుతున్న ఓ ఫ్యాక్టరీలో గుమాస్తా వుద్యోగంలో చేరాడు. జీతం బాగానే వస్తోంది. నిజం చెప్పాలంటే అచ్చం వాడు వాళ్ళ అమ్మ నోట్లోంచి వూడి పడ్డట్టుంటాడు. మగ వేషం వేసుకున్న మా కాంతం లాగే వుంటాడు. పెళ్ళి వయస్సొచ్చి మీదపడ్డా, యిప్పటికీ కాంతం దృష్టిలో వాడింకా పసివాడే. నోట్లో నాలిక లేని అమాయకుడనీ, నాలుగు మాటలు చెప్పిన వాళ్ళ మాయలో పడిపోయేటంత అర్భకుడనీ కాంతం నమ్మిక. వాడి తరవాత ఇద్దరాడపిల్లలు. పిల్లలుముగ్గురికీ ఏడాదో, ఏణ్ణర్థమో వార.



పరిస్థితులు ప్రస్తుత సమాజంలో ఎలా వున్నాయో తెలిసిన వాళ్ళం గనక ముందే జాగ్రత్త పడి ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేసేసి బరువు దింపేసుకున్నాం ఇక మిగిలిన వాడు కృష్ణ.

ఏ మాట కామాటే చెప్పుకోవాలి. మా కృష్ణ ఈ తరం ఆలోచనలకి ప్రతీక అయితే నా ఎదురుగా వాడెప్పుడూ అధికంగా మాట్లాడడు, ఎంతో అవసరం అనుకుంటే తప్ప. వాడెంత తక్కువ మాట్లాడినా వాడి అభిప్రాయా లెటువంటివో నేను ఏ నాడో పసిగట్టాను మొదట్నుంచి. ఎవర్ని శాసించి, నా చెప్పుచేతుల్లో వుంచుకునే స్వభావం కాదు నాది. సర్టెన్ ఎక్స్‌టెంటు వరకే ఆ పద్ధతి ఆచరణీయమని నా విశ్వాసం. అన్ని వేళలా, ప్రతి విషయంలోనూ పిల్లల మీద నిరంకుశాధికారాలు చెలాయించడం కన్నవాళ్ళకి గౌరవప్రదం కాదని నేను అనుకుంటూ వుంటాను అయితే ఈ అభిప్రాయం కాంతం ఒప్పుకోదు. మన బిడ్డలు పూర్తిగా మన చెప్పుచేతల్లోనే వుండాలని వాదిస్తుందామె. సమాజంలో వస్తున్న మార్పులు, 'వింత' ధోరణులు ఆమెకి గిట్టవు. అందుకే ఈ మధ్య మా కృష్ణకీ, కాంతానికీ చిన్న చిన్న సంఘర్షణలు కొనసాగుతూ వస్తున్నాయి. ఈ విషయం నేను గ్రహించాను. అయినా కలగజేసుకోలేదు, ప్రయోజనం వుంటుందన్న ఆశలేక

కాంతం నన్ను కాల్చుకు తినడానికి కారణం అదేనని నాకు తెలుసు. ఎవరి పక్షాన నిలబడి వాదించినా, మరొకళ్ళకి బాధ కలిగించడమే అవుతుందనిపించి మౌనంగా వుండిపోయాను పాతికేళ్ళుగా నా కష్టసుఖాల్లో నిస్వార్థంగా పాలు పంచుకున్న కాంతం ఓ పక్క, ఇరవై మూడేళ్ళుగా మా ఆలనాపాలనల్లో పెరిగిన కొడుకు కృష్ణ మరో ప్రక్క. మధ్యన నేను ఇద్దరూ కావలసిన వాళ్ళే. నా వాళ్ళు, ధర్మకాటాలో ఎవరి పక్క మొగ్గు చూపినా చికాకే. లేని సమస్యల్ని సృష్టించుకోవడం అవుతుంది.

ఆలోచనలు కట్టిపెట్టి, "ఏవిటి కాంతం ఆ వ్యవహారం?" అనడిగేను.

"అంతా నా కర్మ!" అన్నది కాంతం.

"అదుగో, ఆ వేదాంతం మాత్రం మాట్లాడకు. అసలు విషయం చెప్పు.' అన్నాను.

కాంతం కొద్ది సేపు తటపటాయించింది. ఇబ్బంది పడుతున్నట్టుంది, చెప్పడానికి.

"జాన్‌రత్నం కూతురు తెలుసుగా మీకు?" అనడిగింది కాంతం.

"తెలుసు. బంగారు బొమ్మ. పేరు మేరి అనుకుంటా!" అన్నాను.

"అవును మేరి! కృష్ణబాబుతో నే పని చేస్తోందట." అన్నది కాంతం, గంభీరంగా.

"ఒక్క మేరి యేం కర్మ? పద్మ, సుల్తానా, జయమణి... అందరూ ఒక చోటే పని చేస్తున్నారు. ఆ మధ్య మన చిన్నమ్మాయి పెళ్ళికి వచ్చినప్పుడు అందర్నీ పేరు పేరు వరసనా పరిచయం చేశాడుగా కృష్ణ?" అన్నాను.

## ఎండమావి

కలలో కనిపిస్తున్నావు
జీవితంపై ఆశను చిగురిస్తున్నావు
అందుకొందా మనుకొంటే
అందనంత దూరంలో ఉన్నావు
ఎండమావి లాంటి ఉద్యోగమా
ఆటలాడకు దయఉంచి
నాలాంటి నిరాశాజీవులతో!

– జి. జానకీరామ్

## అందరూ మనుషులే

"అందరి సంగతీ ఎందుకులెండి! నేను మాట్లాడేది మేరి గురించే!"

"ఇప్పుడు మేరికి ఏమైందట?" అనడిగేను

"దానికేమీ కాదు. అయ్యేదంతా మన కృష్ణబాబుకే!"

'వాడికేమవుతుంది, కాంతం?" అన్నాను.

"ఏమవుతుందా? పరువూ మర్యాదా మంటగలిసి పోతాయి. వీడా పిల్లతో తెగ తిరిగేస్తున్నాడు" అన్నది కాంతం కోపంగా.

"కొంపతీసి కృష్ణ వెనక నువ్వు సి. ఐ. డి. గా తిరుగుతున్నావో ఏవిటో, నాకు అనుమానంగానే వుంది." అన్నాను

"వాడి తిరుగుళ్ళు నాకు తెలీడానికి నేనే తిరగాలా? చూసిన వాళ్ళెవరైనా చెబుతారు. పక్కింటి హనుమాయమ్మగారూ, ఆవిడ భర్తా మొన్న సినిమా హాల్లో చూసేరట మనవాణ్ణి మేరిని. వెనక సీట్లో కూచుని ఒకటే పక – పకలూ వికవికలూలు!" అన్నది కాంతం.

మౌనంగా వింటున్నాను.

"మొన్న వాళ్ళు చూసి చెప్పడం కాదు! ఇంతకు ముందోసారి నా కళ్ళతో నేనే చూసేను. నిలదీసి అడిగితే, నీదంతా చాదస్తం అమ్మా! మేరి నేనూ మంచి స్నేహితులం సినిమాలకి వెళ్ళినా షికార్లకి వెళ్ళినా తప్పులేదు." అన్నాడు. వాడి దృష్టిలో నాది చాదస్తం! విన్నారా?" అనడిగింది కాంతం ఆవేశంగా.

"నీది చాదస్తం అనడం నే ఒప్పుకోను కాంతం!" అన్నాను చాలా నెమ్మదిగా.

"అంటే వాడు దాంతో తిరగడం ఒప్పుకుంటారన్న మాట?" అన్నది కాంతం రోషంతో.

"తిరగడం రెండు రకాలు కాంతం! మామూలుగా మనసులు విప్పి మాట్లాడుకోవడానికి, ఒకరినొకరు అర్థం చేసుకోడానికి షికార్లకీ, సినిమాలకీ వెళ్ళడం ఒక రకం పోతే... శారీరకమైన కోరికల ఒత్తిడితో, రహస్య స్థలాలు వెదుక్కుంటూ తిరగడం మరో రకం. నా నమ్మకం ఏవిటంటే వాళ్ళు మొదటి రకం తిరుగుళ్ళతో నే సరిపెట్టుకుంటున్నారని." అన్నాను.

"అవి రెండో రకానికి మారవనీ మీకు నమ్మకం ఉన్నట్టుందే? అన్నది కాంతం హేళనగా.

దొరికి పోయేను. ఇప్పుడు నేనేం జవాబు చెప్పినా, కాంతం ఇంకో చిక్కు ప్రశ్న అడుగుతుంది. ఇలాంటి విషయాల్లో ఆడవాళ్ళ లాజిక్ ముందు మగాడు ఓటమి అంగికరించాల్సిందేనని నాకు బాగా తెలుసు. అందుకే నేను సమాధానం చెప్పలేదు.

"అందుకేనండి, వాడి పెళ్ళి ప్రయత్నాలు తొందరగా మొదలెట్టండి అని చెవినిల్లు గట్టుకుని చెప్తున్నాను. జాన్‌రత్నం కూతురు మనవాణ్ణి వల్లో వేసుకోవాలని చూస్తోంది. ఒక్కగానొక్క కొడుకు. అడ్డమైన వాళ్ళ వల్లో పడిపోతే మన పరువుప్రతిష్ఠలు గంగపాలవుతాయి." అన్నది కాంతం, బాధ పడుతూ

నేను కొన్ని క్షణాలు మౌనంగా వుండి, "అదికాదు కాంతం! ఇలాంటి వ్యవహారాల్లో ఏక పక్షంగా ఆలోచించకూడదు. రెండో వైపు నుంచి కూడా ఆలోచించాలి." అన్నాను

"రెండో వైపు నుంచా?" అడిగింది కాంతం.

"అవును మనవాడి వైపు నుంచి అసలు మేరిని వల్లో వేసుకోవాలని వీడే ట్రయల్స్ చేస్తున్నాడేమో? ఏం? అందుకు అవకాశం లేదంటావా?" అన్నాను.

"ఊరుకోండి చాలుగాని. కృష్ణబాబు ఒట్టి అమాయకుడు ఇంకా పాతికేళ్ళయినా రాలేదు వాడికి. వాడి మీద, కన్నతండ్రి అయి వుండి ఇటువంటి అభాండాలు వెయ్యకండి, బావుండదు. వెంటనే జాన్‌రత్నాన్ని, మేరిని కలుసుకుని కృష్ణబాబు మీద ఆశలు పెట్టుకోవద్దని చెప్పి రండి. మా అన్నయ్య ఇప్పటికే పది ఉత్తరాలు రాసేడు. మనతో సంబంధం కలుపుకుంటానంటూ" అన్నది కాంతం.

"ముందు కృష్ణని అడగాలిగా?" అన్నాను

"వాడి మొహం! వాడి కేం తెలుసుని అడుగుతారు?" అన్నది కాంతం.

ఏమి తెలీకుండానే, ఏ రకమైన అభిప్రాయం లేకుండానే మేరి వెంట ఎందుకు తిరుగుతాడూ – అని అడగటానికి ధైర్యం చాలింది కాదు. ధైర్యం చేసి అడిగితే ఇన్ని నెలల తరవాత మళ్ళీ కాంతంతో కలిగిన సాన్నిహిత్యం దూరమవుతుందేమోనన్న భయం. ఈ సమస్య పైకి చిన్నదిగా, పట్టించుకో వీల్లేనంత స్వల్పంగా కనిపించినా, చాలా జటిలమైనదని ఆకళింపైంది నాకు

"సరే నీ యిష్టం! నీళ్ళు తోడు. స్నానం చేసి అలా వెళ్ళొస్తాను" అంటూ కుర్చీలోంచి లేచేను.

★ ★ ★ ★

కాంతానికి మాట యిచ్చానే గాని జాన్‌రత్నాన్ని కలుసుకుందుకి నా మన సొప్పడం లేదు. ఒకవేళ మనస్సుకి నచ్చ జెప్పుకుని కలుసుకున్నా, అతనితో నేనేం మాట్లాడాలి? మీ అమ్మాయి మేరి మా వాడితో తిరుగుతోందట. కొంచెం అదుపులో పెట్టవయ్యా అని చెప్పాలి తీరా చెప్పాక అతనింతెత్తున ఎగిరిపడి మీ వాణ్ణి అదుపులో పెట్టుకోలేక నాకు చెపుతున్నావా అని ఎదురు తిరిగితే, సమర్థించుకోడానికి తగినంత బ్యాక్‌గ్రౌండు నా దగ్గిర లేదు. కృష్ణా, మేరి కలిసి అడపాదడపా

సినిమాలకి, షికార్లకి తిరుగుతున్న విషయం, హనుమాయమ్మా, ఆవిడ భర్తా, వాళ్ళిద్దరి ద్వారా విన్న కాంతం నా చెవిన వెయ్యక ముందే నాకు తెలుసు. అయితే నేను దాన్ని అట్టే సీరియస్‌గా తీసుకోలేదు.

అసలీ రోజుల్లో ఇలాంటి సంఘటనలు చాలా సాధారణమై పోయాయి. హైస్కూలు స్టేజిలోనే పిల్లలు బోయ్ ఫ్రెండ్స్‌తో, గరల్ ఫ్రెండ్స్‌తో తిరగడం చూస్తూనే వున్నాను. వయస్సు, చెత్త రకం సినిమాలూ, సంఘ వాతావరణం కలిసి రేపిన ఉద్రేకాలతో తొందర పడిపోయి, కడుపో కాలో వచ్చి, ఆ ప్రమాదం తప్పించుకోలేక ఆత్మహత్యలు చేసుకున్న ఆడపిల్లల కథలు చాలా విన్నాను.

మా కృష్ణ గానీ, మేరి గాని అలాంటి తొందరపాటుతో ప్రవర్తిస్తారన్న సందేహం లేదు నాకు ముఖ్యంగా మా కృష్ణలో అంత బలహీనత లేదని నా ప్రగాఢమైన నమ్మకం. అందుకే, తెలిసినా తెలీనట్లు వుండిపోయాను. పైగా ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. సంఘంలో ఓ రకమైన గౌరవ స్థానంలో వున్నారు నలుగురి నోళ్ళల్లో పడి అవమానాల పాలయ్యే విధంగా ప్రవర్తించరు.

కాని, ఇద్దరూ స్నేహాన్ని పెంచుకోవడంలో, కలిసి తిరగడంలో ఏ ప్రయోజనాన్ని ఆసిస్తున్నారో తెలుసుకోవలసిన బాధ్యత నాకుంది. అందుకు ప్రప్రథమంగా జాన్‌రత్నాన్నో, మేరినో కలుసుకోవడం కన్న మా కృష్ణని అడగడమే మంచిదనిపించింది.

నడుస్తున్న వాణ్ణల్లా ఓ సారి నిలబడి వాచీ చూసుకున్నాను. సాయంత్రం ఆరు దాటింది. ఈ మధ్య కృష్ణ ప్రతి రోజూ ఓ గంట ఓవర్ టైం చేస్తున్నాడు. ఇంకో పావు గంటలో జంక్షన్‌లో కంపెనీ బస్సు ఆగుతుంది. అక్కడ దిగి, అయ్యర్ హోటల్లో స్నేహితులతో కాస్సేపు పిచ్చాపాటీమాట్లాడుకుని ఇంటికి చేరడం వాడికి అలవాటు. కనక వాణ్ణి అక్కడే కలవడం మంచిది.

# అందరూ మనుషులే

ఇంట్లో అడిగితే మా కాంతం మరో సీను క్రియేట్ చేస్తుంది.

గబ-గబ ముందుకి సాగాను. అయిదు నిముషాల్లో అయ్యర్ హోటల్ జంక్షన్‌కి చేరాను. ఇంకా కంపెనీ బస్సు రాలేదు. రోడ్డు వార నిలబడి ఓ సిగరెట్టు ముట్టించి, గట్టిగా రెండు దమ్ములాగి గాలిలోకి వదిలాను.

ఆలోచించసాగాను.

మేరి నా మనస్సులో మెదిలింది.

అందంగా, చాలా ఆకర్షణీయంగా వుంటుంది. మేరి చెంపకి బారెడు కళ్ళు, నవ్వుతుంటే సొట్టలుపడే బుగ్గలూ, పెద్ద జడా, పొడుగ్గా, పొడుక్కి తగిన అవయవ నిర్మాణంతో చూపుల్ని ఇట్టే నిలబెట్టేస్తుంది. దరిదాపు ఆరడుగులున్న కృష్ణ పక్కన నిలబడ్డా, కలిసి నడిచినా చూడ ముచ్చటగా వుంటుందన్నది నిజం.

ప్రస్తుతం సంఘంలో యువతీయువకులు సౌఖ్యవంతమైన వైవాహిక జీవితం కావాలని తపిస్తున్న సంగతి జగమెరిగిన సత్యం. వాళ్ళ ఆలోచనల్లా సుఖాన్ని గురించే గాని, భారతీయ సామాజిక జీవన సరళిలో వివాహబంధానికున్న ప్రాధాన్యతనీ, పవిత్రతనీ నిలబెట్టాలని కాకపోవచ్చు సుఖజీవనానికి వివాహబంధం చాలా అవసరమని భావించగలగడమే గొప్ప అనుకోవాలి. ఆ వివాహానికి పరస్పర ఆకర్షణా, ఆనందానుభూతులూ ప్రధానంగాని, కులాలూ, మతాలూ, కలిమిలేములు అంతరాలూ అడ్డురాకూడదని అనుకుంటూ వుండటం, శుభ పరిణామమనే చెప్పుకోవచ్చు.

మా కృష్ణా, మేరిలు ఇలాంటి ఆలోచనలోనే వున్నారా? ఈ ప్రశ్న నా మెదడులో అదే పనిగా రొద చేస్తోంది ఎంతకీ సమాధానం చెప్పుకోలేక నాలో నేనే విసుక్కున్నాను.

అంతలో దూరం నుంచి కంపెనీ బస్సు రావడం చూసి ఆలోచనలు కట్టి పెట్టేను. పేపర్లో తల దూర్చాను.

ఇంతలో బస్సొచ్చి ఆగింది. ఉద్యోగులంతా గబ-గబ దిగి హడావిడిగా ఎవరి దారిన వాళ్ళు సాగిపోతున్నారు. అందరి కన్నా వెనకగా మా కృష్ణ, వాడి వెనక మేరి దిగారు. గమనించాను.

ఇద్దరూ నన్ను చూళ్ళేదు.

హోటల్ ముందు నిలబడ్డారు.

"విజ్జీ! ఇక్కడే దిగి పోయావేం?" అని ప్రశ్నించాడు మా కృష్ణ.

"దిగాలనిపించింది. దిగాను. అయినా కృష్ణా! నీ కెన్ని సార్లు చెప్పేను? ఓ డబల్ సీట్‌లో కూచుని నన్ను పిలవమని! పొద్దస్తమానం నువ్వొక డిపార్ట్‌మెంటులో, నేనొక డిపార్టుమెంటులో ఏడుస్తున్నాం. కనీసం బస్సులోనైనా ఒకే సీట్లో కూచుని రావాలని వుండదా నీకు?" అడిగింది విజయమేరి.

"ఎందుకుండదు?" అడిగాడు కృష్ణ చిరునవ్వుతో.

"మరి రోజూ ఇలాగే చేస్తున్నావేం?"

"కావాలనే చేస్తున్నాను. ఇప్పటికే కొలీగ్సంతా మన మీద అసూయతో కుళ్ళి చస్తున్నారు ఇక మనిద్దరం రోజూ ఒకే సీట్లో సర్దుక్కూచుంటే భరించగలరా, చెప్పు! భరించడం సంగతలా వుంచు మనిద్దర్నీ జూ లో జంతువుల్ని చూసినట్లు చూస్తారు ఆ చూపుల్ని తట్టుకోవడం కష్టం!"

నవ్వింది మేరి. ఆమెతో శ్రుతి కలిపేడు మా కృష్ణ.

"ఇంకెన్నాళ్ళిలా?" అడిగింది మేరి.

"సమయం చూసి ఇవ్వాళో రేపో మా డాడీతో చెప్తాను విజ్జీ. ఆయన తప్పకుండా ఒప్పుకుంటారు. మా అమ్మలాంటి చాదస్తాలు ఆయనకి లేవు. సమాజాన్ని ముక్కలు ముక్కలు చేస్తున్న ఈ కులమతాలూ, మూఢాచారాలూ ఆయనకి గిట్టవు. బతికి నన్నాళ్ళూ మనిషి సుఖంగా, సంతోషంగా, సంతృప్తిగా బతకాలనే తత్వం డాడీది వాటి కోసం ఎంత బలమైన గోడలనైనా కూలదోసే ధైర్యం, శక్తి కూడగట్టుకున్న వాడే నిజమైన మనిషి అంటారాయన." అన్నాడు మా కృష్ణ.

"నిజంగా ఆయన దేవుడే కృష్ణా! అలాంటి వాళ్ళు అరుదుగా వుంటారి సంఘంలో. ఇంతకీ కాఫీ తాగిస్తావా, కబుర్లతో కడుపు నింపుతావా?" అనడిగింది మేరి.


"ఇవ్వాళ నేను వాలిని." అన్నాడు కృష్ణ.

అంటే....?" అడిగింది మేరి.

"పొద్దుట బట్టలు మార్చుకుని, పర్సు జేబులో వేసుకోవడం మర్చిపోయేను విజ్జీ! అందుకే నీ మీద వాలి పోవాల్సి వస్తోంది. కనక నేనిప్పుడు వాలిని."

మేరి గల-గల నవ్వింది.

"థాంక్ గాడ్! ఎంత అదృష్టం! నువ్వు నా మీద ఎప్పుడు వాలిపోతావా అని ప్రతిక్షణం ఎదురు చూస్తున్నాను కృష్ణా! ఇన్నాళ్ళకి నా మీద దయ కలిగింది. నువ్వు రోజూ పర్సు మర్చి పోయి వస్తూండాలని, రోజూ నా మీద వాలాలనే నా కోరిక. మేగాడ్ బ్లెస్ మి! పద! ఇవ్వాళ, నీకు చాలా



యిష్టమైన గులాబ్ జాం యిప్పిస్తాను. కాదనకు." అంటూ హోటల్ మెట్లెక్కింది మేరి.

మంత్ర ముగ్ధుడిలా మేరిని అనుసరించాడు మా కృష్ణ.

సన్నివేశం చాలా పట్టుగా, శృంగార రసభరితంగా, ముద్దుగా, ముచ్చటగా సాగింది. పాన్ షాప్ పక్కనే మొహానికి పేపరు అడ్డు పెట్టుకుని నిలబడి వున్న నా చెవుల్లో వాళ్ళు మాట్లాడిన ప్రతి మాటా స్పష్టంగా సోకింది

నా మనసులో మెదిలిన ప్రశ్నకి సమాధానం లభించింది. ఇక ఎగ్జామినేషన్లూ, క్రాస్ ఎగ్జామినేషన్లూ అనవసరం. పైగా మా కృష్ణ నేను రాసిన నాటకాలూ, అప్పుడప్పుడు చెప్పిన ఉపన్యాసాలూ విని నా భావాల్ని పసిగట్టేసి, తన 'విజ్ఞ' ముందు నన్నొక దేవుడిగా చిత్రీకరించేశాడు. ముందరి కాళ్ళకి బంధం వేశాడు. దాదాపుగా నా నోరు నొక్కేశాడు.

అదే ఇప్పుడు నా కొక భయంకరమైన విషమ సమస్యని సృష్టించి పారేసింది. నేను వెళ్ళి కాంతానికేం చెప్పాలి? ఎవరు ఎవర్ని వల్లో వేసుకున్నారని చెప్పాలి? పరస్పరం వల విసురుకున్నారని చెప్పాలా? చెబితే మాత్రం నమ్ముతుందా? పోనీ నమ్మిందే అనుకున్నా, తన కొడుకు ఓ క్రైస్తవుల పిల్లని చేసుకోవడానికి ఒప్పుకుంటుందా? కథ ఇంత దూరం వచ్చాక, అది మొండి కెత్తి కూచుంటే ఫలితం ఏమిటి?

ఇవన్నీ భేతాళుడి చిక్కు ప్రశ్నల్లా నాలో గందరగోళం రేపుతున్నాయి. పేపరు మడిచి షాపువాడికిచ్చేసి, మెల్లిగా నడక సాగించాను. నడుస్తూనే సిగరెట్టు ముట్టించాను. గట్టిగా రెండు దమ్ములాగి గాలిలోకి వదిలాను.

మనస్సంతా ఒక్కసారిగా కల్లోలం అయిపోయింది. మా కృష్ణ తీసుకుంటున్న నిర్ణయం పొరపాటని నేను అనుకోవడం లేదు. వాడు మేరిని ప్రేమించడం ఘోరాపరాధం కాదని ఎరుగుదును. పరిణామశీలమైనది సమాజం మా కృష్ణ అయినా, మరొకడైనా – ఆ కోవకి చెందిన



యువతీయువకులంతా ఈ పరిణామ గదిలో ఇలాగే ప్రవర్తిస్తున్న సంగతి కొత్తేమి కాదు. ప్రతిరోజూ ఈ రకం కథలు వింటూనే వున్నాను.

గతకాలపు సంప్రదాయమో, ఆచారమో, సిద్ధాంతమో – మారుతున్న సమాజానికి అనుగుణంగా రూపుదిద్దుకుంటున్న కొత్త తరం

ఇంటర్ విద్యార్థులారా!
1957 లో స్థాపించిన
రవి కళాశాల
[బాడిపేట, గుంటూరు]
ఎన్నో వేలమంది
ఇంజనీర్లను, డాక్టర్లను
తయారుచేసి
ఆంధ్రుల అభిమానం
చూరగొన్న సంస్థ.
ఇపుడు ఇంటర్,
Bi.P. M.P. గ్రూపులతో
చదివే వారి కోసం
రవి
పోస్టల్
ట్యూషన్
ట్యూషన్స్, గైడ్సు
అవసరం లేకుండా
ఇంటర్ పరీక్షలలోనే గాక
ఎంట్రన్సుపరీక్షలలోకూడా
నెగ్గటానికి ఎంతో
ఉపయోగపడుతుంది.
వివరాలకు రు. 5/-లు
పంపండి.
సి. ఏ. ఎన్. ధన్,
డైరక్టర్.

## అందరూ మనుషులే

వాళ్ళని ఎల్లకాలం చెప్పు చేతల్లో ఉంచడం అసహజమే కాక అసాధ్యం కూడా. పూర్వం ప్రతిపాదింపబడ్డ ధర్మాల లాగే ఆచార సంప్రదాయాలూ, సిద్ధాంతాలూ ఫ్లెక్సిబుల్ అనుకుంటేనే చాలా సమస్యలు నివారింపబడతాయేమో లేకపోతే సంఘర్షణలు తప్పనిసరిగా చెలరేగుతాయి.

ఆలోచనల బరువుతో ఇంటికి చేరేసరికి కాంతం నా కోసం గుమ్మంలో నిలబడి ఎదురు చూస్తోంది.

"వాళ్ళని కలుసుకున్నారా?" అనడిగింది ఎంతో ఆదుర్దాతో.

"ఆ అవసరం లేదు కాంతం!" అన్నాను.

"అంటే?" అన్నది కాంతం అర్థంగాక.

విషయం ఏమీ దాచకుండా చెప్పాను. దాచవలసిన అవసరం కనిపించలేదు.

కాంతం కళ్ళల్లో నీళ్ళు తిరిగేయి.

"చివరికి ఇలా పగ తీర్చుకుంటున్నాడు వాడు వాడి పెళ్ళి విషయంలో మన ప్రమేయం లేనట్లే నన్నమాట! మనల్ని వీధిలో పెట్టడానికి వాడికి మనసెట్లా ఒప్పిందండీ?" అన్నది ఆవేశంగా.

"వాడి మనసిప్పుడు వాడిది కాదుగా కాంతం! దాన్ని మేరీకి ధారాదత్తం చేసేశాడు. బాధ పడి ప్రయోజనం లేదు." అన్నాను.

"ఆపలేమంటారా?" అడిగింది కాంతం.

"యుద్ధం చెయ్యాలి. చేస్తాం. ఒకవేళ ఆ యుద్ధంలో మనం గెలిచినా, వాడు గెలిచినా ఫలితం ఒక్కటే కాంతం!" అన్నాను.

"వివరంగా చెప్పండి!" అన్నది కాంతం.

"ఏముంది? మనం గెలిస్తే వాడు దూరమై పోయి, కులం, ఆచారం, సంప్రదాయం మన దగ్గిరే మిగుల్తాయి. ఇక వాడు గెలిస్తే ఈ మూడూ పోవడం కాకుండా వాడు కూడా దూరమై పోతాడు. మొత్తం మీద ఏ రకంగా చూసినా వాడు దూరం కావడం తప్పదు." అన్నాను.

కాంతం కొన్ని క్షణాలు మాట్లాడలేదు.

ఆమె చాలా దారుణమైన వేదన అనుభవిస్తున్న సూచనలు ఆమె ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. కాని అది అనివార్యం. నేను ఓదార్చ గలిగిందేం లేదు.

తన కన్న కొడుకు తన మాట వినకుండా పోతున్నాడనీ, ఓ కులంగాని కులం పిల్ల వల్లో పడిపోతున్నాడనీ, ఇదంతా తనేనాడో చేసుకున్న పాపానికి ఫలితం అనీ కుళ్ళి కుళ్ళి ఏడ్చింది కాంతం.

కృష్ణకి చెప్పి చూస్తానంటూ ఓదార్చడానికి ప్రయత్నించాను. అదే విధంగా ఆ రాత్రి మా కృష్ణతో, అన్ని విషయాలూ వివరంగా మాట్లాడేను. గదిలో జరుగుతున్న మా సంభాషణంతా హాల్లో కూర్చుని కాంతం వింటూనే వుంది.

చాలా వాదోపవాదాల తరవాత, మేరీ, మా వాడి హృదయంలో ఎంత గాఢంగా ముద్రించుకు పోయిందో అర్థమైంది. ఆమెతో జీవితాన్ని ఎంత సౌఖ్యావహంగా వాడు వూహించు కుంటున్నాడో గ్రహించాను. ఆమెని దూరం చేసుకున్నప్పటి జీవితం ఎంత సారహీనమో వాడు వాడి భాషలో వివరిస్తుంటే అవాక్కయి పోయాను.

మా యిద్దరిదీ ఒకే మాట నాన్నా! మీరు నన్ను అర్థం చేసుకుంటారను కున్నాను. మీరు మీ తరపు నుంచే చెప్తున్నారు. మా వైపు నుంచి కూడా ఆలోచించండి. దాదాపుగా మే మిద్దరం భార్యాభర్తలం అయిపోయినట్లే మా కంపెనీలో అందరూ అనుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఎవరు వెనకడుగు వేసినా, మీరు బాధపడే కులం, ఆచారాల కన్న మా యిద్దరి ప్రవర్తనకే కళంకం ఎక్కువ. అంత చాతగాని వాళ్ళుగా మిగలడం ఒక నాటికి జరగదు." అని తేల్చేశాడు మా కృష్ణ.

ఇక నేను చెప్పగలిగిందీ, చెయ్య గలిగింది ఏం మిగల్లేదు. గదిలోంచి బైటికి నడిచాను.

"కాంతం, విన్నావుగా వాడి మాటలు?" అన్నాను కాంతంతో.

"ఆహా! పూర్తిగా విన్నాను. వాడిష్టం ఒచ్చినట్లు ఏడవమనండి. మన ఏడుపు మనం ఏడ్చి వూరుకుందాం. అసలు మనకి కొడుకే పుట్టలేదని అనుకుందాం. అంతేగాని, ఇలా కులాన్ని మంట గలిపిన దౌర్భాగ్యుడు ఈ ఇంట్లో ఉండటానికి మాత్రం నే ఒప్పుకోను. ఒకవేళ అటువంటి పరిస్థితి వస్తే ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటాను. అంతే!" అంటూ లోపలికి వెళ్ళి పోయింది కాంతం, మూర్తీభవించిన విషాదంలా.

నేను ఆ హాల్లో శిలా ప్రతిమలా నిలబడి పోయాను.

* * * *

శ్రావణమాసం వచ్చేసింది.

## విఘ్నేశ్వర స్తోత్రము

ప. వేకువ వేళల
వెలుగుల జిలుగును
సుప్రభాతం నీకు
విఘ్నపతీ.....
విఘ్నపతీ.....

చ. నీ గుజ్జు రూపము
నీ ఏకదంతము
కనులకు విందులు
మనసుకు ఇంపులు "వేకువ"
విద్యలకు నొజ్జవై
విఘ్నములకు రాజువై
యుగముల జగముల
జీవించు మానవుల
నీ కృప సారించి
నీ దయ చూపించి
దీవెన లీయుము "వేకువ"

–కె. నాగేశ్వరి

మరో నాలుగు రోజుల్లో వ్రతాలూ గట్రా మొదలవుతాయని కాంతం అప్పటికి పది పన్నెండు సార్లు నాతో చెప్పింది. తల వూపి వూరుకున్నాను.

"మన కర్మ యిలా కాలిపోయింది." అని ఒకటే కళ్ళనీళ్ళు పెట్టుకుంది కాంతం ఆ రోజు.

"అనవసరంగా మనసు పాడు చేసుకోకు కాంతం!" అన్నాను.

"ఈసారి ఆడపిల్లలు కూడా రావడానికి వీలుపడదని రాశారు!" అన్నది కాంతం.

"అవును. ఎవరి సంసారాలు వాళ్ళవి!" అన్నాను.

"ఇహ బతికున్నన్నాళ్ళు ఒంటరిగానే నా వెధవ బతుకు గడవాలని మొహాన రాసి పెట్టాడు, ఆ దిక్కుమాలిన దేవుడు!" అన్నదామె దుఃఖం దిగమింగుతూ.

"ఛీ! ఛీ! ఏవిఁటా మాటలు?" అన్నాను. బైటి నుంచి, "నాన్నా!" అన్న పిలుపు వినిపించింది ఒళ్ళంతా ఒక్కసారి జలదరించింది.

"కాంతం! అది మనం కృష్ణబాబు గొంతేనే' అన్నాను. నాకు తెలీకుండానే నా గొంతు కంపించింది.

కాంతం కళ్ళు తుడుచుకుంది.

"అవును! వాడి గొంతే! ఆర్నెల్ల తరవాత మనం గుర్తొచ్చినట్లున్నాం!" అన్నది. ఆ గొంతులో ఏ రకమైన భావమూ లేదు. కాని ఆ మొహంలో మాత్రం అనిర్వచనీయమైన వెలుగు.

"వెళ్ళి, విషయ మేమిటో అడగండి! నా మొహం వైపు చూస్తారేం?" అన్నది కాంతం.

తడబడే కాళ్ళతో వరండాలోకి నడిచాను.

"కులాసాగా వున్నారా నాన్నా! అమ్మ ఎలా వుంది?" అన్నాడు కృష్ణ.

"ఏదో ఇలా వున్నాంరా! మీరు?" అని అడిగేను. ఆర్నెల్లయి పోయింది వాడితో మాట్లాడి. నా కళ్ళల్లో నీళ్ళు తిరుగు తున్నాయి.

"బాగానే వున్నాం నాన్నా! మిమ్మల్ని చూడాలనిపించి...." అని ఆగేడు కృష్ణ. వాడి కళ్ళల్లోంచి ధారాపాతంగా జారుతున్నాయి అశ్రువులు.

"అమ్మాయి రాలేదా?" అడిగాను.

"వచ్చింది నాన్నా! వీధి గేటు దగ్గిరే వుండి పోయింది. దాని భయం దాన్ది!" అన్నాడు కృష్ణ తలవంచి.

"అదేవిఁట్రా! వీదిలో నిలబెట్టడ మేమిటి?" అన్నాను, బాధగా.

"తెలివి తేటలు! పిలవమనండి!" అన్నది గుమ్మంలో నిలబడి, కాంతం.!

కృష్ణ పిలవకుండానే వచ్చి, కృష్ణ పక్కనే నిలబడి చేతులు జోడించింది, మేరి

నేను కాంతం వైపు చూశాను. ఆమె కళ్ళార్పకుండా ఆ జంటని చూస్తూ వుండి పోయింది

"అమ్మ చాలా సార్లు చెప్పేది నాన్నా! నా భార్యతో నోములన్నీ పట్టిస్తానని. విజయ రోజూ గోల పెడుతోంది, శ్రావణ మాసం వచ్చింది, వెళ్ళి మిమ్మల్ని అడగమని! మీరు తప్ప మా కెవరున్నారు నాన్నా! వాళ్ళ నాన్న గారికివేవీ తెలీవు!" అన్నాడు కృష్ణ ఎలాగో గొంతు పెగుల్చుకుని

"అదేవిఁటి? ఆ అమ్మాయి కీ నమ్మకాలు ఉండవుగా?" అన్నది కాంతం చాలా, ఆశ్చర్యంగా.

"అది నా భార్యమ్మా! అలాని నేను విజయని ఏ విషయంలోనూ బలవంతం చెయ్యలేదు. చెయ్యను కూడా! తనే యిష్టపడుతోంది. కాని నేనే అన్నాను. మా అమ్మకి, నాన్నకి నేను కాని వాణ్ణి! ఇవన్నీ జరిగేవి కావని. అయినా విజయ పట్టుబట్టి బైలుదేర దీసింది." అన్నాడు కృష్ణ.

"కృష్ణా!" అని పిలిచింది కాంతం.

"అమ్మా!" అంటూ కృష్ణ మెట్లెక్కి గబ-గబ తల్లిని సమీపించాడు.

కాంతం కొన్ని క్షణాలు కృష్ణ మొహంలోకి చూసింది. ఒక్కసారిగా రెండు చేతుల్లో వాణ్ణి చుట్టేసింది. వెక్కి వెక్కి ఏడుస్తోంది.


"అమ్మా, విజయా! వాళ్ళని కొంచెం ఓదార్చు!" అన్నాను.

మా కోడలు విజయ మేరి మెట్లెక్కి పైకొచ్చి వాళ్ళ పక్కనే నిలబడింది.

కాంతం ఓ చేత్తో ఆమె తల నిమిరింది.

కొన్ని కొన్ని మధుర దృశ్యాలు నాలాంటి రచయితకి చాలా అరుదుగా కనిపిస్తూ వుంటాయి.

కొన్ని రసమయ కావ్యాల సృష్టికి ప్రేరణలవుతూ వుంటాయి. □



"సాక్షి గణపతి" (శ్రీశైలం)

"ఓ సాక్షి గణపయ్య
సేతులెత్తి మొక్కెదమయ్య!
అక్షయంబు లోనయిన
అణు పరీక్షల నాపవయ్య!
విశ్వశాంతి నొసగుమయ్య."

— నిడమర్తి ఆదిలక్ష్మిప్రసాద్

